

కొత్త బస్సును ప్రారంభించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - శంఖవరం


రిబ్బన్ కట్ చేస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

అన్నవరం సత్యనారాయణ స్వామి దర్శనార్థం కొండపైకి వచ్చే యాత్రికుల రవాణా కోసం దాత ఇచ్చిన బస్సును ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ప్రారంభించారు. శనివారం కొండపై ఇఒ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎంఎల్ఎ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అరబిందో ఫార్మా కంపెనీ అందజేసిన 42 సీట్లు గల బస్సును ఆమె జండా ఊపి ప్రారంభించారు. అనంతరం యాత్రికులతో కలిసి కొండ దిగువకు ఆమె ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం గగనమాయే..!

-మధ్యాహ్నం 12 దాటితే ఒపి బంద్
-అరకొరగానే వైద్య సేవలు
-ఆన్‌లైన్ ఒపితో సామాన్యులకు అవస్థలు
-ఇదీ జిజిహెచ్‌లో నిర్వాకం



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

పేద, సామాన్య ప్రజానీకానికి ఆరోగ్య ప్రధాయినిగా సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు అష్టకష్టాలు తప్పడం లేదు. అరకొర సౌకర్యాల నడుమ జిజిహెచ్‌లో సేవలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో సదుపాయాలను కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నలుమూలల నుంచి కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి నిత్యం వందలాది మంది రోగులు వస్తున్నారు. అంటే ఐదు జిల్లాల ప్రజలు సేవలు పొందుతున్నారు. అలాగే సరిహద్దు అనకాపల్లి జిల్లా ప్రజలు కూడా ఇక్కడే వైద్యం పొందాలి. ఈ నేపథ్యంలో ఏటా 13 లక్షల మందికి పైగా వైద్య సేవలను పొందుతున్నారు. వీరిలో దాదాపు 5 లక్షల మంది ఆసుపత్రిలో చేరి మేజర్, దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్సను పొందు తున్నారు. 1,065 పడకలు కల్గిన ఆసుపత్రికి రోజులో 2,500 నుంచి 3 వేల వరకూ రోగులు వస్తున్నారు. జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల నుంచి సైతం ఎక్కువగా వైద్యసేవల కోసం ఇక్కడకు వస్తున్నారు. దీంతో ఈ ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు మరింతగా మెరుగు పర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని రోగులు అభిప్రాయపడుతున్నారు.

దూర ప్రాంత రోగులకు ఇక్కట్లు

కాకినాడ జిజిహెచ్‌లో మెరుగైన వైద్యం అందుతుందనే కారణంతో చుట్టుపక్కల ప్రాంతాల వారంతా ఇక్కడకే వస్తున్నారు. అన్ని రకాల వైద్య సదుపాయాలు ఉన్నాయని పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు, ఇతర వైద్యశాల నుంచి వైద్యులు ఇక్కడకు రోగులను రిఫర్ చేస్తారు. అయితే ప్రధానంగా ఒపి సేవలు అరకొరగానే అందుతుండడం వల్ల దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు అష్ట కష్టాలు పడుతున్నారు. మూడేళ్ళ క్రితం నుంచి మొదలు పెట్టిన ఆన్‌లైన్లో ఒపి సేవలతో గంటల తరబడి రోగులు క్యూలో ఉన్న ఒపి చీటీ అండడం లేదు. సోమవారం, మంగళవారం, గురువారం వంటి వారాల్లో ఉదయం 10 గంటలకు క్యూలైన్లో నిలుచుంటే మధ్యాహ్నం 12 గంటల అనంతరంమే ఒపి చీటీ ఇచ్చే పరిస్థితి నెలకొందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆన్ లైన్ కావడంతో ఒపి చీటీలను మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఇస్తున్నారు. ఆధార్, రేషన్ వివరాలు సహా ఫోన్ నెంబర్, అడ్రస్ నమోదు చేస్తుండడంతో ఒక్కో ఒపి చీటీకి 3 నుంచి 5 నిముషాల సమయం పడుతోంది. వందలాదిమందికి ఆన్‌లైన్ ద్వారా ఒపి చీటీలు ఇచ్చే క్రమంలో సర్వర్ సమస్యలతో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిపై ఒత్తిళ్లు ఎక్కువవుతున్నాయి. క్యూ లైన్లో నిలబడి రోగులు, వారి బంధువులు పడరాని పాట్లు పడుతున్నారు. దూరప్రాంతాల నుంచి వస్తున్న వారు ఆధార్, రేషన్ వంటి వివరాలు తెలియక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైగా గంటల తరబడి లైన్లో నిలబడినా సమయం మించిపోయింది అంటూ సిబ్బంది సమాధానం చెబుతుండడంతో సమస్యలు తప్పడంలేదు.

ఉదయమే వచ్చి లైన్లో నిలబడుతున్నా అప్పటికే వందలాదిమంది రోగులు ఒపి కౌంటర్ల వద్ద నిలబడుతూ ఉండటంతో సమయానికి వైద్యం అందక అనేక మంది తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. ఏజెన్సీ ప్రాంతాలైన విఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక తదితర మండలాల నుంచి రోగులు ఇక్కడకు వస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడకు చేరాలంటే సుమారు 6 గంటల సమయం పడుతుంది. దీంతో గిరిజన ప్రాంతాల రోగులు మరిన్ని సమస్యలను ఎదుర్కొంటున్నారు.

అత్యవసర సేవలకు మినహా

సాధారణ, దీర్ఘకాలిక రోగులు ఇక్కడ చూపించుకోవాలంటే మధ్యాహ్నం 12 గంటల లోపు రావాల్సిందే. అయితే అత్యవసర కేసులకు మాత్రమే అన్నివేళలా ఒపి టిక్కెట్లు ఇస్తారు. మిగిలిన సాధారణ రోగులు మధ్యాహ్నం 12 దాటితే మరుసటి రోజున సేవలు పొందాల్సి వస్తుంది. దీంతో అనేకమంది దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు పలువురు వైద్యులు మధ్యాహ్నం ఒంటిగంట దాటితే కనిపించని పరిస్థితి ఉందని రోగుల ఆరోపిస్తున్నారు. కొన్ని విభాగాల్లో వైద్యులు సాయంత్రం వరకు అందుబాటులోనే ఉంటున్నప్పటికీ పలు సందర్భాల్లో మధ్యాహ్నం దాటితే వైద్యులు కనిపించడం లేదనే విమర్శలు లేకపోలేదు. అత్యవసర విభాగంలో 24 గంటలూ అందుబాటులో ఉంటున్నప్పటికీ సాధారణ ఒపి సేవలు వలన పలువురు రోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు.

సౌకర్యాలను మెరుగుపర్చాలి



కాకినాడ జిజిహెచ్‌కు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ప్రభుత్వం సౌకర్యాలను మరింత మెరుగుపరచాలి. ప్రధానంగా ఒపి టిక్కెట్ ఇచ్చే సమయాన్ని పెంచాలి. కనీసం ఒంటిగంట వరకు అయినా ఆన్‌లైన్ ఒపి టికెట్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి.

-రాజు, రోగి బంధువు, తాళ్ళరేవు

ప్రత్యామ్నాయం చూపాలి



మా అబ్బాయికి అనారోగ్య సమస్య రావడంతో వైద్యం కోసం వచ్చి చివరి నిముషంలో ఒపి టిక్కెట్ తీసుకున్నాను. 2 గంటలకుపైనే లైన్లో ఉన్నాను. ఆన్‌లైన్ అంటూ మొత్తం అన్ని వివరాలు అడుగుతున్నారు. అందుకే బాగా ఆలస్యం అవుతుంది. కౌంటర్లను పెంచి సకాలంలో ఒపి చీటీలు ఇవ్వాలి. సమయాన్ని పెంచాలి.

-పద్మ, దుమ్ములపేట, కాకినాడ


బేబికి స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

ఎంఎ.బేబికి ఘన స్వాగతం

పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించనున్న సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి
గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికిన శ్రేణులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల్లో పర్యటన నేపథ్యంలో మధురపూడి విమానాశ్రయానికి వచ్చిన సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబికి ఆ పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికాయి. తొలుత సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.లోకనాథం, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి టి.అరుణ్, అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి బి.కిరణ్ పూలమాలలు వేసి, బొకేలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బేబి మీడియాతో మాట్లాడారు. తానూ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్ జాన్ బ్రిట్టాస్ వేర్వేరు మార్గాల్లో రెండు రోజుల పాటు పోలవరం నిర్వాసిత గ్రామాల్లో పర్యటించనున్నట్టు తెలిపారు. పర్యటన అనంతరం తమ డిమాండ్లను పత్రికా ముఖంగా తెలియజేస్తామన్నారు. అనంతరం కొద్దిసేపు స్థానిక నాయకులతో మాట్లాడారు. తరువాత రోడ్డు మార్గం గుండా దేవీపట్నం మండలంలోని పోలవరం నిర్వాసిత గ్రామాలకు బయలు దేరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.పవన్, జె.రాంబాబు, పి.తులసి, జిల్లా నాయకులు ఎస్-ఎస్.మూర్తి, సుందర్‌బాబు, కె.రామకష్ణ, పూర్ణిమరాజు, రాంబాబు, రామకృష్ణ, మాచారావు, సత్తిరాజు, అరుణకుమారి, బేబిరాణి, రాజు, భాస్కర్, రాజేష్ , పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

ప్రజాశక్తి - కాకినాడ


లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులతో కలిసి తన క్యాంపు కార్యాలయంలో సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి కలెక్టర్ పూలామాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, రైతుల సంక్షేమం, కార్మికుల హక్కుల కోసం గౌతు లచ్చన్న విరోచిత పోరాటం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమములో బిసి సంక్షేమ శాఖ అధికారి ఎం.లిల్లీ, బిసి కార్పొరేషన్ ఇడి ఎ.శ్రీనివాసరావు, సహాయ బిసి సంక్షేమాధికారి పి.రామకృష్ణ, డబ్ల్యూహెచ్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

ప్రజాశక్తి - తుని


సభలో మాట్లాడుతున్న దువ్వా శేషబాబ్జి

కార్మిక హక్కులను హరించేలా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అన్నారు. శనివారం తుని ప్రాజెక్టు అంగన్‌వాడీ యూనియన్ మహాసభ బ్యాంకు కాలనీలోని బాల భవన్లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించుకునేందుకు నిరంతరం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం తుని అంబేద్కర్ నగర్ అంగన్‌వాడీ ఆయా మార్తమ్మ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు యూనియన్ నుంచి రూ.47,500 నగదును అందించారు.

నూతన కమిటీ ఎన్నిక

తుని ప్రాజెక్టు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులుగా నెమల రాణి, వై.ధనలక్ష్మి, ట్రెజరర్ గా ఎ.రమణమ్మ, ఉపాధ్యక్షులుగా ఉమామహేశ్వరి, శ్రీలక్ష్మి, గౌరవ అధ్యక్షులు డి.మేరీసమాధానం, నక్కెళ్ళ శ్రీనివాస్, కమిటీ సభ్యులుగా లోవమ్మా, సుజాత, మంగ, భవాని, ఇందిరా, కృష్ణవేణి, శాంతి కుమారి, చిట్టి పాప, పద్మ, రాములమ్మ, సుబ్బలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, సిఐటియు నాయకులు గొర్ల వెంకటరమణ, కామేశ్వరి సిఐటియు కోటనందూరు మండల కార్యదర్శి ఎస్‌కె.పద్మ, సిపిఎం మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చైతన్యంతోనే స్వాతంత్ర్య ఉద్యమం సాకారం

ప్రజాశక్తి - కాకినాడ



సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజా చైతన్యంతోనే స్వాతంత్ర్య ఉద్యమ స్వప్నాలు సాకారం అవుతాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం స్థానిక యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నంనాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో '78 ఏళ్ల స్వతంత్ర భారతం - స్వప్నాలు - సాకారాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ వాసంశెట్టి సోనీ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. వాస్కోడిగామా భారత దేశంలో అడుగుపెట్టిన నాటి నుంచి 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం వరకు బ్రిటిష్ కంపెనీ పాలనపై వివిధ రూపాల్లో ప్రజలు పోరాడారని తెలిపారు. 1947 స్వాతంత్ర సాధన ఉద్యమం అనేక స్రవంతులుగా జరిగిందన్నారు. అనేక మతాలు, కులాలు, సాంప్రదాయాలు, భాషలు కలిగిన ప్రజలంతా మనమంతా భారతీయులమే అనే గొప్ప స్ఫూర్తితో ఉద్యమ సాగించారని గుర్తు చేశారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగం రూపొందించ బడిందన్నారు. పాలకులు విఫలమైనప్పుడు ప్రజా చైతన్యమే దేశాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందన్నారు. ఆ విధంగా స్వాతంత్ర ఉద్యమ స్వప్నాలను సాకారం చేసుకోవాల న్నారు. ఈ సదస్సులో అంబేద్కర్ ఉద్యమ నేత అయితాబత్తుల రామేశ్వరరావు, యుటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకర్ వర్మ మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు సదస్సుకు ఆహ్వానం పలుకగా జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్.వర్మ వందన సమర్పణ చేశారు.

'రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి'

ప్రజాశక్తి - తాళ్ళరేవు


స్టడీ సర్కిల్‌లో మాట్లాడుతున్న ఈశ్వరరావు

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ప్రజా సంఘాల కార్యాలయంలో 'స్వాతంత్ర్య పోరాటం-భారత రాజ్యాంగం విశిష్టత' అనే అంశంపై స్టడీ సర్కిల్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వరాజ్య పోరాటంలో భిన్నమతాల ప్రజలు ఐక్యతతో బ్రిటీష్ సామ్రాజ్యంపై పోరాడారని గుర్తు చేశారు. ఆ పోరాటంలో ఎందరో ప్రాణాలను ఫణంగా పెట్టారని అన్నారు. నాటి పోరాటంలోనే ప్రజల నుంచి ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సోషలిజం, స్వావలంబన వంటి డిమాండ్స్ వచ్చాయని గుర్తు చేశారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాలు భారత దేశానికి నష్టం చేకూరుస్తున్నాయని అన్నారు. బిజెపి కపటత్వాన్ని అర్థం చేసుకుని వారి కుట్రలను తిప్పికొట్టడం ద్వారా ప్రజలు భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో ప్రజాసంఘాల నాయకులు వల్లు రాజబాబు, కన్నీడి వెంకటరమణ, కె.ఈశ్వరిబాయి, పి.అనంతలక్ష్మి, ఆర్.నాగలక్ష్మి, డి.అదృష్టదీపుడు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలంటూ ఆందోళన

ప్రజాశక్తి - ఏలేశ్వరం


ఆందోళన నిర్వహిస్తున్న యువకులు

మండలంలోని రమణయ్యపేట-జె అన్నవరం రహదారి పున్ణనిర్మించాలంటూ పలు గ్రామాలకు చెందిన యువకులు ఆందోళనకు దిగారు. శనివారం రమణయ్యపేట, గొంటువానిపాలెం రహదారిపై చేపట్టిన ఆందోళన సుమారు 5 గంటల పాటు కొనసాగింది. సుమారు మూడు కిలోమీటర్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ సందర్భంగా యువకులు మాట్లా డుతూ గత దశాబ్ద కాలం పైబడి రోడ్డు నిర్మించకపో వడంతో తమ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఎన్నికల ముందు టిడిపి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సైతం రోడ్డుపై ఆందోళన చేసి అడ్డంగా గోడ నిర్మించారని గుర్తు చేశారు. అధికారంలోకి వస్తే వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక ముఖం చాటేశారని యువకులు విమర్శంచారు. ప్రత్తిపాడు, రంపచోడవరం ఎంఎల్ఎలు, ఆర్ అండ్ బి అధికారులు సంఘటనా ప్రాంతానికి తక్షణమే రావాలని డిమాండ్ చేశారు. ఏలేశ్వరం, అడ్డతీగల పోలీసులు శనివారం సెలవు రోజు కావడంతో అధికారులు అందుబాటులో లేరని తాత్కాలికంగా ఆందోళనను విరమించాలని సూచించారు. రోడ్డు పనులు చేపట్టకపోతే ప్రజా సంఘాల మద్దతుతో ఆందోళనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమణయ్యపేట, తూర్పు లక్ష్మీపురం, గొంటువానిపాలెం, జె.అన్నవరం గ్రామాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

182 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో శనివారం 182 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని రెవెన్యూ డివిజనల్ కార్యాలయ ఎఒ మాధవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోటనందూరులో 5.2, తునిలో 5.8, రౌతులపూడిలో 11.4, శంఖవరంలో 10.6, ఏలేశ్వరంలో 40.6, జగ్గంపేటలో 30.2, కిర్లంపూడిలో 18.2, ప్రత్తిపాడులో 20.8, తొండంగిలో 16.8, పెద్దాపురంలో 1.6, గండేపల్లి లో 22.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదయిందన్నారు.

తహశీల్దార్‌కు ఉత్తమ సేవా అవార్డు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి


అవార్డును అందుకుంటున్న తహశీల్దార్

మండల తహశీల్దార్ జి.చిన్నారావు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవ అవార్డును డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆయన అభినందనలు తెలిపారు.

వల్లభునికి రూ.2.38 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం


అన్నదానం పాల్గొంటున్న యాత్రికులు

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం ఒకరోజు రూ.2.38 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్య నిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. వివిధ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ.1,47,160, అన్నదాన విరాళాల ద్వారా రూ.69,570, కేశఖండన ద్వారా రూ.4,080, తులాభారం ద్వారా రూ.300, లడ్డు ప్రసాదం ద్వారా రూ.16,935 వెరసి రూ.2,38,045 ఆదాయం సమకూరింది. యాత్రికులకు ఉదయం పులిహోర, మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాణాచార్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ నిర్మించేలా చర్యలు

ప్రజాశక్తి - సామర్లకోట


ఎంఎల్ఎకు వినతిపత్రం ఇస్తున్న వెంకట్రావు

పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామంలో జడ్‌పి ఉన్నత పాఠశాల, కళాశాలకు ప్రహరీ గోడను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన రేలంగి వెంకట్రావు కోరారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్పను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో బయట నీరు పాఠశాల ఆవరణలోకి వస్తుందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.


ఐక్యతతో గ్రామాల అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి - తాళ్లరేవు


మీడియాతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ దాట్ల

ఐకమత్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు అన్నారు. శనివారం కోరంగి పంచాయతీ సీతారామపురం కోలాటి వారి రేవులో నూతనంగా నిర్మించిన విజయ కనకదుర్గ ఆలయ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి, మతసామరస్యంతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కందికొండ భాస్కర శర్మ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



అంతంతమాత్రంగానే మహిళా ప్రయాణికులు

ప్రజాశక్తి - సామర్లకోట



రాజమహేంద్రవరం వెళ్లే బస్సు ఎక్కుతున్న మహిళలు

ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినా అంతంతమాత్రంగానే మహిళలు వినియోగించుకుంటున్నారు. స్త్రీ శక్తి పథకం శుక్రవారం సాయంత్రం సిఎం చంద్రబాబు ప్రారంభించిన వెంటనే ఈ పథకం అమలులోకి వచ్చింది. శనివారం కృష్ణాష్టమి సెలవు కావడంతో బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య అంతంత మాత్రంగానే కన్పించింది.

జిల్లాలో కాకినాడ మీదుగా నిత్యం 145 బస్సులు సామర్లకోట నుంచి వివిధ ప్రాంతాలకు బయలుదేరుతాయి. సామర్లకోట నుంచి కాకినాడ, రాజమహేంద్రవరం, జగ్గంపేట, ధవలేశ్వరం, గోకవరం, రంపచోడవరం, రాజవొమ్మంగి, ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలేశ్వరం తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి సేవలు అందుతున్నాయి. అయితే శుక్ర, శని రెండు రోజులు సెలవు దినాలు కావడంతో మహిళా ప్రయాణికులు తాకిడి పెద్దగా కన్పించలేదు. సాధారణంగా 48 శాతం మహిళలు ఆర్‌టిసి సేవలనే వినియోగించుకుంటున్నారు. స్త్రీ శక్తి పథకంలో కల్పించిన ఉచిత బస్సుతో మహిళలు 78 శాతం వరకూ వినియోగించుకునే అవకాశాలు ఉన్నాయని ఆర్‌టిసి అధికారులు అంచనా వేస్తున్నారు.


టిడిపి నాయకుడు బూరయ్యను పరామర్శిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

టిడిపిలోనే మహిళలకు గౌరవం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

టిడిపిలోనే మహిళలకు తగిన గౌరవం ఉంటుందని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం మండలంలోని లంపకలోవ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు అనారోగ్యంతో బాధపడుతున్న చక్కపల్లి బూరయ్యను ఆమె పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసిపి పాలనలో మహిళలపై నిత్యం ఏదో ప్రాంతంలో దాడులు జరుగుతూనే ఉండేవని విమర్శంచారు. కూటమి ప్రభుత్వం మహిళలకు తగిన గుర్తింపు ఇవ్వడంతోపాటు వారి ఆర్థికాభివృద్ధికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని, అయితే అమలు చేస్తున్న హామీలను సైతం వైసిపి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ పర్యటనలో సొసైటీ ఛైర్మన్ వరుపుల రామకృష్ణ, నాయకులు పంది దొరబాబు, చక్కపల్లి మందీశ్వరరావు, శెట్టి సుబ్బారావు, చక్కపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

ప్రజాశక్తి - ఆలమూరు

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ మృతి చెందాడు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అచ్యుతాపురం గ్రామానికి చెందిన వల్లూరి సాయి నిరంజన్‌కు(26) గత ఏడాది ఆగస్టు 23న వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న అతను శనివారం ఉదయం తన అత్తింటి వారు నివాసముంటున్న పశ్చిమ గోదావరి జిల్లా తణుకు వెళ్లాడు. అతను శనివారం సాయంత్రం తన బైక్‌పై తిరుగు ప్రయాణ మయ్యాడు. కొత్తూరు - వెదురుమూడి ఆర్అండ్‌బి రోడ్డు జోరిచెట్ల సమీపంలోనున్న కోళ్ల ఫారం వద్ద వేగంగా వచ్చిన లారీ ఇతని బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో సాయి నిరంజన్ తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అంతలో స్థానికులు ప్రయివేటు వాహనంపై రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా సాయి నిరంజన్ మార్గమధ్యలో మృతి చెందాడు. ఈమేరకు ఎస్ఐ నరేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


నుజ్జయిన కారు ముందుభాగం

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన కారు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక టోల్‌గేట్ సమీపంలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో హైవేపై వెళుతున్న ఒకదాని వెనుక ఒకటి చొప్పున మూడు కార్లు ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

వ్యక్తి కోసం గోదావరిలో గాలింపు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలోని క్రరివానిరేవు గ్రామానికి చెందిన వ్యక్తి కనపడక పోవడంతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనికి సంబంధించి కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ఇవి.. క్రరివానిరేవు గ్రామానికి చెందిన అర్ధాంగి గోవింద రాజులు (30) వెల్డింగ్ వర్కర్‌గా పని చేస్తూ భార్య, బిడ్డలను పోషించుకుంటున్నాడు. అతడు గత గురువారం నుంచి వెళ్ళి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపులో అన్నంపల్లి కొత్త అక్విడెక్ట్‌పై గోవింద రాజుల బైక్‌ను, అక్కడే అతడి దుస్తులు, చెప్పులు ఉండడాన్ని గ్రామస్తులు గుర్తించారు. బైక్ పక్కన యాసిడ్ బాటిల్ కూడా మూత తీసి ఉండడం గుర్తించారు. కానీ అతడి మొబైల్, ఇయర్ ఫోన్స్ మాత్రం లేకపోవడం గమనార్హం. గోవిందరాజులుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం గోవింద రాజులు భార్యతో తన స్నేహితుడు డబ్బులు ఇస్తానని చెప్పాడని చెప్పి బైక్ పై వెళ్ళి తిరిగి రాకపోవడంతో పాటు మొబైల్ స్విచ్ ఆఫ్ అయి ఉంది. అన్నంపల్లి అక్విడెక్ట్‌పై బైక్‌ను గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ డి.జ్వాలా సాగర్ దీనిపై విచారణ చేపట్టారు. ఒకవైపు గ్రామస్తులు, అతని బంధువులు మురమళ్ళ వృద్ధ గౌతమి గోదావరి నదిలో మోటర్ పడవలపై కుండలేశ్వరం, పల్లంకుర్రు, బ్రహ్మసమేధ్యం తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

చెరువు నుంచి నీరు బయటకు రాకుండా తూము కట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంపాలెంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని రాంపాలెం గ్రామానికి చెందిన రైతు బుల్లి వెంకన్న(39) వరి సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలోని బాలంక చెరువులోకి నీరు అధికంగా చేరింది. చెరువు నుంచి వచ్చిన నీరు తన వరి పంట మీద పడడంతో చెరువు నీరు బయటకు రాకుండా తూము కట్టే క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగి మరణించాడని తెలిపారు. మృతుని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు స్టేషన్ రైటర్ కె.దుర్గారావు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - కొవ్వూరు

మండలంలోని కుమారదేవం ఏటిగట్టు వద్ద గెస్ట్ హౌస్‌లో పని చేస్తున్న బొక్క రత్నరాజు (48) శనివారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గెస్ట్ హౌస్ వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌ను ఆన్ చేసేందుకు వెళ్లిన రత్నరాజు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగపై కాలు వేయడంతో విద్యుత్ శాఖకు గురయ్యాడు. సంఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచిపెట్టారు. మృతుని సోదరుడు కుమారుడు లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


పొర్లుతున్న వర్షపు నీరు

గ్రోయిన్లలో పొంగి పొర్లుతున్న వర్షపు నీరు

ప్రజాశక్తి - కోటనందూరు

గత మూడు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురవడంతో గ్రోయిన్లలో వర్షపు నీరు పొంగు పొర్లుతుంది. పంట పొలాలకు చేరవలసిన సాగునీరు గ్రోయిన్లకు మరమ్మతులు చేయకపోవడంతో పిచ్చి తుప్పలు, వ్యర్ధాలతోనూ నిండిపోవడంతో సాగునీరు తాండవ రిజర్వాయర్ ఏరు నుంచి వృధాగా పోతుందని రైతులు సత్తిబాబు, నూకరాజు, దేవుళ్ళు, కామరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబవాయి, కామినేడు గ్రోయిన్ల కింద సుమారు 12 ఎకరాలకు పైగా సాగునీరు అందించవలసి ఉంది. తక్షణమే గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉచితంతో ఉత్సాహం.. వర్షంతో నిరుత్సాహం

గోదారి గలగలలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'స్త్రీ శక్తి' పథకం కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది తరువాత ఎట్టకేలకు అమల్లోకి వచ్చింది. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. జిల్లాలో ఈ కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా నాయకుల్లో ఉత్సాహం కనిపించింది. అయితే మహిళల నుంచి అనుకున్నంత స్పందన కరువైంది. అంగన్‌వాడీలు, మహిళా ఉపాధి కూలీలను అధికారులే దగ్గరుండి బస్టాండ్‌లకు మహిళలను తరలించారు. కాకినాడ జిల్లా జగ్గంపేటలో 5 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం రాత్రి 7 అయినా ప్రారంభం కాలేదు. దీంతో చీకట్లోనే ఎంఎల్ఎ రాక కోసం, బస్సు సర్వీసు ప్రారంభం కోసం మహిళలు వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఉచిత బస్సు ప్రయాణం ఉన్నప్పటికీ ఎక్కడా మహిళలు ఉత్సాహంగా ముందుకు వచ్చిన దాఖలాలు లేవు. ఎప్పటి మాదిరిగానే వారు ప్రయాణాలు చేశారు. ప్రయాణికుల సంఖ్య కూడా పరిమితంగానే ఉంది. సెలవులు అయినప్పటికీ మహిళలు ఉత్సాహం చూపకపోవడం నాయకులను నిరుత్సాహానికి గురిచేసింది. ఇక ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, టిడిపిల మధ్య పొరపొచ్చాలు 'స్త్రీశక్తి' పథకంతో మరోమారు వెలుగు చూశాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా కూటమి నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా పిఠాపురంలో మాత్రం జనసేన, టిడిపి నాయకులు వేర్వేరుగా ఉచిత బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కాకినాడ జిల్లాలోనే ఉన్న సమయంలో ఈ ఘటన చోటు చేసుకోవడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మరోపక్క ఉచిత బస్సుల వల్ల తాము ఉపాధిని కోల్పోతామంటూ ఆటో కార్మికులు రోడ్డెక్కారు. పలుచోట్ల ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందించారు. శనివారం జిల్లా వ్యాప్త నిరసనలకు వారు దిగారు.

వాతావరణ హెచ్చరికలతో బెంబేలు

ఫ్లాష్ ఫ్లడ్స్, క్లౌడ్ బరెస్ట్ అంటూ వాతావరణ శాఖ చేస్తున్న హెచ్చరికలు ప్రజల్లో భయాందోళనకు గురిచేస్తున్నాయి. వాతావరణంలో మార్పులు కూడా వారిని మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంతో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటి వరకూ వర్షాభావంతో కొంత పంట పాడైతే ఇప్పుడు అధిక వర్షంతో ఉన్న పంట కొట్టుకుపోయే పరిస్థితి వచ్చింది. తూర్పు గోదావరి జిల్లాలో ఉండ్రాజవరం, చాగల్లు, పెరవలి, నిడదవోలు రూరల్ మండలాల్లో ఇప్పటికే వరిచేలు నీట మునిగాయి. ఈ నష్టంపై అధికారులు నేటికీ ఎలాంటి ప్రకటన చేయలేదు. రానున్న మూడు రోజుల్లోనూ భారీ వర్షాలు, క్లౌడ్ బరెస్ట్‌లు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేయడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. మరో పక్క పల్లపు ప్రాంతాల్లో మోకాల్లోతు నీటిలో ఉన్నాయి. కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలంలో ప్రభుత్వ కార్యాలయాల్లోకి వర్షపు నీరు ప్రవేశించింది. వర్షపు నీటిలోనే కూర్చొని అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. కొత్త జిల్లా ఏర్పాడినా నేటికీ సొంతంగా పక్కా భవనాలు లేక ఇలా అద్దెభవనాల్లో అరకొర వసతుల మధ్యనే ఉద్యోగులు కాలం వెళ్లదీస్తున్నారు.

ఎన్నికలు లేకుండానే పిఎసిఎస్‌ల పాలకవర్గాలు

గత ప్రభుత్వం మాదిరిగానే ఎలాంటి ఎన్నికలు లేకుండానే ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా పిఎసిఎస్‌లకు కమిటీలను ఏర్పాటు చేసింది. త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంది. నాయకుల అనునాయకులు పదవులను ఇచ్చి ప్రసన్నం చేసుకునే విధంగా గత వైసిపి సర్కారు మాదిరిగానే వ్యవహరిస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సహకార సొసైటీల్లో పూర్తిస్థాయిలో పాలక వర్గాలు లేకపోవడంతో రైతులకు పూర్తిస్థాయి సేవలు అందట్లేదు. కూటమిలోనైనా ఎన్నికలు నిర్వహిస్తారని రైతులంతా ఎదురు చూశారు. వారి ఆశలను అడియాలు చేస్తూ కూటమి సర్కారు త్రిమెన్ కమిటీలను నియమించి చేతులు దులిపేసుకుంది. ఇప్పటికే ఈ కమిటీలు పదవీ బాధ్యతలను సైతం స్వీకరించాయి. పదవులు అందించిన మంత్రులు, ప్రజాప్రతినిధులను కలిసి తమ కృతజ్ఞతలు తెలిపి భక్తిని చాటుకున్నాయి. మరోపక్క కమిటీల్లో న్యాయం జరగలేదని కొంత మంది ముఖం చాటేసిన దాఖలాలు లేకపోలేదు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రావులమ్మ తల్లి గుడి వద్ద ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మిక యూనియన్ జిల్లా 2న మహాసభల గోడ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వ పాలనలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను నిలుపుదల చేసి కార్మికుల పొట్టకొట్టారని విమర్శించారు. ఎన్నికల ముందు సంక్షేమ బోర్డు పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తియినా అమలు చేయలేదన్నారు. తక్షణమే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పథకాలను తిరిగి ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే మూడేళ్లలో సంక్షేమ పథకాలు అమలుకు కార్మికుల శ్రేయస్సుకు సంఘం కార్యక్రమాల రూపకల్పనకు ఈ మహాసభలు ఉపయోగపడతాయన్నారు. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 రెండు రోజులపాటు జగ్గంపేటలో జరిగే జిల్లా మహాసభలను ప్రజాప్రతినిధులు, మేధావులు, కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రొంగల ఈశ్వరరావు, కొల్లి సత్తిబాబు, బోరా సత్తిబాబు, కింగం దుర్గాప్రసాద్, నండ్ల చిరంజీవి, పెన్నాడ వీరబాబు, కంది బాబు, కంది సతీష్, గంగుమళ్ల శ్రీను, కింగం రాజు, కింగం బుజ్జి, కర్రి బాబూరావు, కడితి గణపతి పాల్గొన్నారు.


గోడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

దాతలు నిర్మించిన బస్ షెల్టర్లు ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణానికి చెందిన చలికి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమార్తెలు నిర్మించిన బస్ షెల్టర్లను ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబు రాజు ప్రారంభించారు. సుమారు రూ.6 లక్షలతో స్థానిక ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద, సిబిఎం హైస్కూల్ సెంటర్‌లో దాతలు నిర్మించారు. పట్టణ ప్రజల అవసరార్థం దాతలు ముందుకొచ్చి బస్ షెల్టర్లను నిర్మించడం అభినందనీయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్, భీమేశ్వరాలయ ట్రస్ట్ బోర్డ్ మాజీ ఛైర్మన్ కంటే జగదీష్‌మోహన్, జనసేన పట్టణ అధ్యక్షులు సరోజ వాసు, టిడిపి నాయకులు బలుసు వాసు, అందుగుల జార్జి చక్రవర్తి, వల్లూరి దొరబాబు, దాట్ల శ్రీనివాస్, శెట్టిబత్తుల దుర్గ, పడాల వీరబాబు, గుడాల శంకర్, కాళ్ళ రవీంద్ర, పితాని సూర్యనారాయణ పాల్గొన్నారు.


బస్ షెల్టర్‌ను ప్రారంభిస్తున్న చినరాజప్ప, బాబు

సర్పంచుకు వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - కోటనందూరు

కోటనందూరు సర్పంచ్ గరిసింగు దొరబాబును వైసిపికి చెందిన పలువురు నాయకులు శనివారం పరామర్శించారు. ఆయన తల్లి మరినమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో తుని నియోజకవర్గ వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షుడు లంక కృపానందం, తొండంగి, కోటనందూరు, తుని, తుని రూరల్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు దడాల సూరిబాబు, దడాల గంగాధర్, బండి నానిబాబు, కర్రి సత్య జగదీష్, రాయి దాసు, సర్పంచులు జగటాల, వీరబాబు, రాయి మేరీ, ఎంపిటిసి సభ్యులు కొత్తపల్లి మాణిక్యాలరావు, కో-ఆప్షన్ సభ్యులు జగటాలకోట సత్తిబాబు, కురందాస్ రాము తదితరులు ఆయనను పరామర్శించారు. మృతిరాలు మరినమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.


నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

పంట సాగులో యాంత్రీకరణ అవసరం

ప్రజాశక్తి - తుని

పంట సాగులో యాంత్రికీకరణ అవసరమని, తద్వారా ఆదాయం పెరుగుతుందని ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. శనివారం తునిలో రైతు విజయోత్సవ ట్రాక్టర్ ర్యాలీ జరిగింది. టిడిపి నాయకులు యనమల రాజేష్, చింతనగాడి అబ్బాయితో కలిసి ఆమె ఈ ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం రాయితీపై అందిస్తుందని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు పూర్తిస్థాయిలో సాగు నీటిని అందిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్ అంకంరెడ్డి రమేష్, గొర్లి అచ్చియ్యనాయుడు, దంతులూరి చిరంజీవిరాజు, కోడా వెంకటరమణ, కొయ్యా కేశవ్, పోలిశెట్టి రామలింగే శ్వరరావు, కొయ్యా సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీకి జెండా ఊపుతున్న ఎంఎల్ఎ దివ్య

శ్రీవిజ్ఞాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుక

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక శ్రీ విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను పాఠశాల కరస్పాండెంట్ బిఎల్ఎస్.సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన బృందావన నృత్యాలు, శ్రీకృష్ణ-రాధ-గోపికల వేషధారణ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డ్రాయింగ్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిసిహెచ్.చౌదరి, ప్రెసిడెంట్ బి.సుబ్బారావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి వ్యవస్థాపకులు దేవత రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ శివారులో నివసించే పేదలకు ఆహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ స్థానికంగా జరిగిన శుభకార్యంలో ఆహార పదార్థాలు మిగిలిపోయినట్లు తనకు సమాచారం రావడంతో ఆ పదార్థాలను సేకరిం పేదలకు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శరన్, రాజేష్, లక్ష్మి పాల్గొన్నారు.

యాదవుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - పెద్దాపురం

యాదవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు అన్నారు. శనివారం స్థానిక యాదవ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎంఎల్ఎ, డిసిసిబి ఛైర్మన్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు పైల చిన్నబ్బాయి, అధ్యక్షులు గదుల నూకరాజు, కార్యదర్శి కురుందాసు దుర్గాప్రసాద్, కురందాసు గణేష్, అనుమళ్ల సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, కొరిపూరి రాజు పాల్గొన్నారు.

మునిగిన పంట పొలాలను పరిశీలించిన వర్మ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

సుద్దగడ్డ కొండకాలువ కింద ముంపునకు గురైన పంట పొలాలను శనివారం రైతులతో కలిసి మాజీ ఎంఎల్ఎ, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఎస్‌విఎస్ఎన్.వర్మ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లప్రోలు, లక్ష్మీపురం, సీతారాంపురం, తాటిపర్తి, వన్నెపూడి గ్రామాల పరిధిలోని పంట పొలాల్లోకి ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో వరద నీరు రావడం జరిగిందన్నారు. ప్రస్తుతానికి తగ్గుముఖం పట్టిందని తెలిపారు. పట్టణంలో దేవినగరం, కంకరరేవళ్ళు, శివాలయ మాన్యం, ఐబిసి కాలనీ, ఎస్‌సి కాలనీలు ముంపు భారిన పడకుండా ఉండేందుకు 2018లో సుద్దగడ్డ కొండకాలువ ఆధునికీకరణకు రూ.160 కోట్లతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. శంకుస్థాపన చేసి రమణక్కపేటలో పనులను సైతం ప్రారంభించామని వివరించారు. అయితే తదుపరి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ పనులను కొనసాగించకుండా నిలుపుదల చేశారని అన్నారు. దాని ఫలితమే నేడు పొలాలు ముంపునకు గురయ్యాయని అన్నారు. ఎన్నో ఏళ్ల పోరాడి సాధించుకున్న ఆ పనులను నిలుపుదల చేసిన వ్యక్తి జగన్ అని విమర్శంచారు. గత ఎన్నికల సమయంలో ఎంఎల్ఎ టిక్కెట్టును త్యాగం చేసిన సమయంలో రైతుల కోసం పురుషోత్తపట్నం, ఏలేరు ఫేస్ -2 ఆధునికీకరణ చేయాలని షరతు పెట్టానని అన్నారు అందులోభాగంగానే పురుషోత్తపట్నం ద్వారా గోదావరి జలాలను సాగుకోసం విడుదల చేస్తున్నారని అన్నారు. ఏలేరు ఫేస్-2 ఆధునికీకరణ పనులను త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ పర్యటనలో టిడిపి నాయకులు గుండ్ర సుబ్బారావు, బస్వా సత్యనారాయణ, శీరం మాణిక్యం,పాల్గొన్నారు.


వరి పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్ఎ వర్మ

అవార్డు అందుకున్న డాక్టర్ ప్రవీణ్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని జడ్.రాగంపేట సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టిఎస్.ప్రణీత్ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఆసుపత్రి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


అవార్డును అందుకుంటున్న డాక్టర్ ప్రవీణ్

రీజెన్సీ విద్యార్థులకు మెడిసిన్‌లో సీట్లు

ప్రజాశక్తి - యానాం

స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో చదివిన పలువురు విద్యార్థులు పుదుచ్చేరిలోని ఆయా కళాశాలల్లో ఎంబిబిఎస్, బిడిఎస్‌లో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపల్ మార్తాండ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుదుచ్చేరిలోని ఇందిరాగాంధీ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎం.వెంకటేష్, జి.జెస్సీప్రియా, కె.భవ్యకీర్తి, జి.లక్ష్మీ అఖిల ఎంబిబిఎస్ సీట్లు, అలాగే వెంకటేశ్వర ప్రయివేట్ మెడికల్ కళాశాలలో కె.భావ్యశ్రీ, ఎస్.జెస్సికా, డి.దినేష్ ఎంబిబిఎస్ సీట్లు సాధించారని తెలిపారు. ప్రభుత్వ డెంటల్ కళాశాలలో ఆర్.యుక్తముఖి బిడిఎస్ సీటు సాధించిందని తెలిపారు. తమ విద్యార్థులు సాధించిన విజయాలు కళాశాలకే గర్వకారణమని అన్నారు. ఆయా విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ ప్రసాద్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఘనంగా డెజూర్ ట్రాన్స్‌ఫర్ డే

ప్రజాశక్తి - యానాం

డెజూర్ ట్రాన్స్‌ఫర్ డేను శనివారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సంస్థలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. స్థానిక గాంధీ పార్కులోని స్వాతంత్ర్య సమరయోధుల స్తూపానికి ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి,మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్‌పి చింతా కోదండ రామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ ఫ్రెంచ్ పాలిత పుదుచ్చేరిని భారత దేశంలో చట్టబద్ధంగా విలీనమైన రోజును డెజూర్ ట్రాన్స్‌ఫర్ డేగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అధికారులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పిఠాపురం

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక ఉప్పాడ బస్టాండ్ సెంటర్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోన్లో ఎవరైనా బ్యాంకు ఖాతా వివరాలు, ఒటిపి అడిగితే చెప్పొద్దన్నారు. ఫోను మెయిల్ ద్వారా వచ్చే తెలియని వెబ్‌సైట్స్ లింక్లను ఓపెన్ చేయొద్దని సూచించారు. డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు, తెలియని వ్యక్తుల వద్ద నుంచి లింక్స్, మెసేజెస్, ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అటువంటి అనుమానాస్పద ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీనివాస్

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

ప్రజాశక్తి - కరప

స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఎం.అనుపమ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భోగిరెడ్డి గంగాధర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు మురళి, కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్రగడ రమేష్, మండల ఎస్‌సి సెల్ నాయకుడు మెండు గోవిందు, కార్యాలయ సూపరింటెండెంట్ జివిఎల్.నరసింహం, సీనియర్ అసిస్టెంట్ టి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు